


"ఛ... ఛ... అస్సలు కామన్ సెన్స్ లేదు..." అనుకుంటూ అనసూయ తనలో తను గొణుక్కుంటూంది ఇందాకట్నించీ.

"ఏమిటండీ... ఏమైంది?" అని అడిగాను నేను ఇక ఉండబట్టలేక.

"అసలు సంస్కారం అనేది చదువుతో వస్తుందటండీ...పుట్టుకతో రావాలి గానీ...ఛ... ఛ... బొత్తిగా కామన్ సెన్సు లేదు." ఈసారి ట్రేలోని ఫైళ్లను ధబీమని టేబులుమీద పడేస్తూ అంది.

"డిస్పాచ్ సెక్షనులోని దామోదరం గానీ మళ్ళీ మీ ముందు పోకిరీ వేషాలు వేశాడా?" కాస్త తగ్గుస్వరంతో ఆమెని ప్రశ్నించాను.

"ఛ...ఛ...దానికింత బాధెందుకు? హైహీల్సుతో వాడి పళ్లు రాలగొట్టనూ?"

"మరి మీ కింత కోపం తెప్పించిన వాళ్ళెవరు?"

"ఇంకెవరూ, రాధ!!"

"అరె! ఆమేం చేసిందండీ?"

"ఇంకా ఏంచేయాలి. మొన్న నేను ఆఫీసులో ఏమీ తోచదుకదా అని చదువుకుందామని టేబులు సొరుగు లోంచి నవల తీశానా?..."

"ఊ..."

"అది రాధ నా టేబులుమీద ఉండటం చూసి తనకు ఆ రచయిత వ్రాసిన నవలలంటే చాల యిష్టమని అంటూ నన్ను అడగకుండా పుస్తకం తీసుకోవడమే కాకుండా ఇంటికూడా పట్టుకెళ్ళి పెట్టుకుంది. అసలు ఆమెకూ నాకూ ఏమంత పెద్ద పరిచయం ఉందని పుస్తకం అలా అడక్కుండా పట్టుకు పోతుంది? పుస్తకం ఎప్పుడిస్తావని అడుగుతే ఈ వేళ రేపు అంటుందే గానీ ఇప్పటిదాకా తేలేదు. ఈవేళ తప్పకుండా తెచ్చిస్తానని ఆఫీసుకే రాలేదు. మానరలెస్ క్రీచర్." పళ్ళు నూరింది అనసూయ.

ఆమె పళ్ళు నూరడం ఇలా పూర్తయిందో లేదో అలా రాధ డిపార్టుమెంటులోనికి అడుగు పెట్టింది.

"అదిగోనండీ, ఆమె వచ్చింది," అన్నాను నేను.

రాధ అటెండెన్సు రిజిస్టరులో సంతకంచేసి నా దగ్గరికి వచ్చి గుడ్ మార్నింగ్ చెప్పి "ఈ వేళ లేట్ పర్మిషన్ పెట్టానండీ- అందుకే ఆలస్యంగా వచ్చాను" అంది వాచ్‌వంక చూస్తున్న నా వైపు చూసి నవ్వుతూ.

"నా నవల తెచ్చారా?" ముఖం అదోలా పెడుతూ అడిగింది అనసూయ.

"ఓ తెచ్చాను." అని తన హాండ్ బ్యాగ్ తెరిచి నవల తీసి అందిస్తూ "చాల చెత్త నవల. ఏం బాగోలేదు" అని హాలు చివర ఉన్న తన సీట్లోకి వెళ్ళి కూర్చుంది.

"అంత బాగోలేని నవలైతే పూర్తిగా చదివేవరకూ ఎందుకు పెట్టుకోవాలి? మరునాడే ఇచ్చేయవచ్చుగా" అని తనలోతాను విసుక్కుంది అనసూయ.

ఆ రోజు అనసూయ అసలు పనే చేయలేదు. ఆ నవల పట్టుకుని కూర్చుంది. సాయంత్రం నాలుగు గంటలకు లేచింది.

"ఇంటికి వెళ్ళిపోతున్నారా?" అని అడిగాను.

"లేదండీ, ఈ పుస్తకం ఎకౌంట్సు డిపార్టుమెంటులోని సరోజకు ఇచ్చేసి వస్తాను."

"రాధ ఈ పుస్తకం తీసుకెళ్తే అంత బాధపడి తీరా ఆమె తెచ్చి ఇచ్చేసేక వేరేవాళ్లకు ఇస్తున్నారేం?"

"నవల పూర్తిగా చదివేశానుగా.... ఇచ్చేయక ఏం చెయ్యను? అసలు ఈ నవల సరోజదే- పదిరోజుల క్రితం పాపం తను చదువుకుందామని తెచ్చుకుంటే నేను లాక్కుని వచ్చేశాను. ...ఇచ్చేయాలి..." అంటూ పుస్తకం తీసుకుని ఎకౌంట్సు డిపార్టుమెంటుకు వెళ్ళింది అనసూయ.

---